క్లుప్తంగా

కానిస్టేబుల్ రాత పరీక్షకు ఆర్టీసీ బస్సులు

తుని: కాకినాడ జిల్లాలో ఆదివారం నిర్వహించే పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎం.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఉదయం 6 గంటలకు కాకినాడ నుంచి సూరంపాలెం, కోరింగ్ డైట్ కాలేజ్, పెద్దాపురం మహారాణి కళాశాలతో పాటు దివిలి, చేబ్రోలకు తుని, ఏలేశ్వరం ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. రాత పరీక్షకు వెళ్లే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అన్నదానం

జగ్గంపేట: స్థానిక రావులమ్మతల్లి గుడి వద్ద శనివారం అన్నదానం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తుని రూరల్: ప్రత్తిపాడు మండలం వొమ్మంగి గ్రామానికి చెందిన మెంటే సూర్యకుమారి (36) తుని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు రూరల్ ఎస్సై ఎ.బాలాజీ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... సూర్యకుమారి ఈ నెల 17న భర్త లచ్చారావుతో కలసి మోటార్ సైకిల్‌పై మండలంలోని లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చారు. అమ్మవారి దర్శనం అనంతరం స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా తేటగుంట వద్ద సూర్యకుమారి మోటార్ సైకిల్‌పై నుంచి జారి పడిపోయారు. తీవ్రంగా గాయపడిన సూర్యకుమారిని భర్త లచ్చారావు తుని ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఆమె మృతి చెందినట్టు ఎస్సై వివరించారు.

మల్లేపల్లిలో...

గండేపల్లి: పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మల్లేపల్లికి చెందిన దాసపల్లి రాజు (33) మనస్తాపంతో శుక్రవారం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పేదల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి

- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- ఒంటిమామిడిలో గడపగడపకూ మన ప్రభుత్వం

తొండంగి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని ఒంటిమామిడిలో శనివారం రాత్రి ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత మూడేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు.



ఒంటిమామిడిలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

స్థానికులు రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, వీధి దీపాలు తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పలు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. గ్రామ యువత కోరిక మేరకు వాలీబాల్ కోర్టు ఏర్పాటుకు రూ.50 వేలు తన సొంత నగదును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ, ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కొయ్యా మురళి, గాబు రాజు, పార్టీ మండల యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు, ఎంపీడీఓ పసపులేటి సతీష్, సర్పంచ్ అంగుళూరి సుధాకర్, ఉపసర్పంచ్ గోసల కిషోర్, కింతాడ పాపారావు, పెదపూడి రమణ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ సిబ్బందిపై దాడి

ప్రత్తిపాడు: విద్యుత్ శాఖ సిబ్బందిపై హోటల్ యజమాని దాడి చేయడంతో నిందితులను వెంటనే అరెస్టు చేయాలంటూ ఆ శాఖ సిబ్బంది ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ వద్ద శనివారం ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ధర్మవరం గ్రామంలో షేక్ పేరయ్య హోటల్ నిర్వహిస్తున్నాడు. విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో విద్యుత్ శాఖ సిబ్బంది గతంలో డిమాండ్ నోటీసు ఇచ్చారు. కాగా అసిస్టెంట్ లైన్‌మెన్ ఆదారి రామకృష్ణ పేరయ్య హోటల్‌కు సమీపంలోని వేరే షాపు వద్ద బైక్‌పై ఉండగా పేరయ్య, అతని కుమారుడు లోవరాజు అసిస్టెంట్ లైన్‌మెన్‌పై దాడి చేశారు. దుర్భాషలాడి అతడిని గాయపరిచారు. దీనిపై అసిస్టెంట్ లైన్‌మెన్ రామకృష్ణ ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానిక ఎస్సై కె.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

తమ సిబ్బందిపై దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగులు ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. విద్యుత్ బకాయిలు చెల్లించనందుకు నోటీసులు ఇవ్వడం నేరమా అంటూ వారు ప్రశ్నించారు. ఇలా దాడులకు పాల్పడితే విధులు ఏవిధంగా నిర్వర్తించాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఏ రాజశేఖర్, ఏఈఈ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల 327 సంఘం కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘ కార్యదర్శి చినబాబు, లైన్ ఇనస్పెక్టర్లు వైవీ రమణ, గోపి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు

తుని: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల చెంతకే చేరుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 10వ వార్డులో కౌన్సిలర్ మొల్లేటి ప్రభావతి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం మున మున్సిపాలిటీ, మన బాధ్యత కార్యక్రమం జరిగింది. చైర్‌పర్సన్ సుధారాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ అందిస్తున్న పథకాలను వివరించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, వక్ఫ్‌బోర్డు జిల్లా వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జెడ్ ఆర్ యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, షేక్ బాబ్జి, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తుని 10వ వార్డులో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ సుధారాణి

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

కిర్లంపూడి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్ లబ్ధిదారులకు సూచించారు. స్థానిక జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలను ఎంపీడీఓ బి.సతీష్‌బాబు, హౌసింగ్ ఏఈ జీవీవీ సత్యనారాయణతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందిస్తోందన్నారు. దీంతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ప్రధాన రహదారి నుంచి జగనన్న కాలనీకి రోడ్డు నిర్మించాలని లబ్ధిదారులు కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

శంఖవరం: మండలంలో కత్తిపూడిలో శనివారం తాటాకిల్లు దగ్ధమైంది. వీఆర్వో శ్రీనివాస్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొల్లా సత్యనారాయణ ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాపించాయి. నగదు, విలువైన వస్తువులు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా వేశామన్నారు. తక్షణ సాయంగా బాధితుడికి 10 కేజీల బియ్యం అందజేశామన్నారు. ప్రభుత్వపరంగా బాధితులను ఆదుకుంటామని చెప్పారు.

నేత్ర దానం

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన కొత్త వెంకటరత్నావతి (83) మరణానంతరం శనివారం తన నేత్రాలను దానం చేశారు. వెంకటరత్నావతి వృద్ధాప్యంతో మృతి చెందగా కాకినాడ బాదం బాలకృష్ణ ఐబ్యాంక్‌కు ఆమె కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేశారు. వెంకటరత్నావతికి ముగ్గురు కుమారులు ఉన్నారు. తాను మరణించినప్పటికీ ఇతరులకు చూపునిచ్చిన వెంకటరత్నావతిని పలువురు ప్రశంసించారు.

భక్తులతో రత్నగిరి కిటకిట

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 30 వేల మంది స్వామివారిని దర్శించారు. వారిలో సగం మంది భక్తులు ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చినవారే. ఆలయం వద్ద తీవ్ర రద్దీ ఏర్పడింది. భక్తులు సత్యదేవుడిని దర్శించిన అనంతరం సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. 1,500 స్వామివారి వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షలు ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మందికి ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. శనివారం పర్వదినం కావడంతో తిరుచ్చి వాహనం మీద సత్యదేవుని ప్రాకారసేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద ఆలయప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశాక ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. ధనుర్మాసోత్సవాలు అనంతరం తొలిసారిగా స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ఊరేగించారు. ఇకపై ప్రతీ శనివారం ఈ ప్రాకారసేవ కొనసాగనుంది.



స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న పండితులు, భక్తులు

ప్రత్యంగిర హోమం

అన్నవరం: పుష్య అమావాస్యను పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శనివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు యనమండ్ర శర్మ ఘనపాఠి, గంగబాబు, సత్యదేవుని ఆలయ ప్రధానార్చకులు కోట శ్రీనివాస్, పరిచారకులు చిట్టెం వాసు, నగేష్, కూచుమంచి ప్రసాద్ హోమం జరిపారు. 25 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కిర్లంపూడి: నిర్లక్ష్యపు డ్రైవింగ్ నేరమని కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం క్రిష్ణవరం టోల్ ప్లాజా వద్ద సేఫ్ వే కంపెనీ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఏర్పాటు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కంటి వైద్య నిపుణులు సుమారు 200 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. సేఫ్ వే కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్ రజనీకాంత్ మహాపాత్ర, ఏజీఎం శ్రీనివాసరావు, టోల్ ప్లాజా మేనేజర్ కృష్ణ చైతన్య, టీబీ ఆర్ కంపెనీ ప్లాజా మేనేజర్ నెహమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

గండేపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.మోహన్ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారుల భద్రత, ప్రయాణికుల క్షేమమే ధ్యేయంగా ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రమాదాలు నివారించేందుకు ప్రస్తుతం ఉన్న కెమెరాలకు అదనంగా మరో 2300 కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పెద్దాపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, కాకినాడ ఇన్‌చార్జ్ ఆర్టీఓ ఆర్.సురేష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బీవీ మురళి కృష్ణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం వాహనదారుల నిర్లక్ష్యం కారణంగానే జరుగుతున్నాయన్నారు. రహదారి భద్రతా నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎన్ సతీష్ రెడ్డి, కళాశాల సిబ్బంది సీహెచ్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత

కోటనందూరు: రహదారి భద్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎస్సై స్వామినాయుడు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక పోలీసుస్టేషన్ నుంచి బస్టాండ్ సెంటరు వరకూ ఆటోడ్రైవర్లు, పోలీసు సిబ్బందితో కలిసి ర్యాలీ చేశారు. అక్కడ మానవహారంగా ఏర్పడి రోడ్డు భద్రతపై నినాదాలు చేశారు.

ఘనంగా గీతా పారాయణ

ఏలేశ్వరం: స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం గీతాపారాయణ, విష్ణుసహస్రనామ పారాయణ, లలితా పారాయణ నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు అలమండ దుర్గావెంకటప్రసాద్, కటకం కిరిటీ ఆధ్వర్యంలో మహిళలు గీతాపారాయణ, విష్ణుసహస్రనామ పారాయణ, లలితా పారాయణ చేశారు. అనంతరం పలు మహిళా విభాగాలకు అధ్యక్ష, కార్యదర్శులను నియమించారు. విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి అధ్యక్షురాలిగా పాబోలు దేవి, కార్యదర్శులుగా ప్రగళ్లపాటి రాధ, పాబోలు సుజాతలను నియమించారు. దుర్గావాహిని అధ్యక్షురాలుగా కామాక్షి, కార్యదర్శులుగా లక్ష్మి, పద్మజలను నియమించారు.